'వికసిత్ భారత్'ను సద్వినియోగం చేసుకోవాలి



చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతీనగర్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ మాట్లాడుతూ... సంకల్పయాత్ర ఏర్పాటు ద్వారా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో సింగిల్ విండో ప్రక్రియ ద్వారా ప్రజలకు పథకాలు వాటి ప్రయోజనాన్ని తెలియజేయడంతో పాటు వారు ఉపయోగించేందుకు కార్యక్రమం ఉద్దేశం అని అన్నారు. ఆయా కార్యక్రమాలు, పథకాలకు, దరఖాస్తు చేసుకోవచ్చని, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు, బ్యాంక్ పాసుబుక్, రేషన్ కార్డు, కేవైసీ పత్రాలను అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బీజేపీ పార్టీ నేతలు వినయ్‌కుమార్, రత్నసాయి చంద్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, ప్రకాశ్ జాదవ్, నర్సింహా, కుమార్, శ్రీనివాస్, నీరజ్ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



ముషీరాబాద్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: నియోజకవర్గం పరిధిలో కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని బ్రహ్మంగారి దేవాలయ సమీపంలో రూ. 88 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముషీరాబాద్‌లో రాజకీయాలకు అతీతంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను యుద్ధప్రాతిపాదికన పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కావాల్సిన నిధులను విడుదల చేయిస్తున్నాం అన్నారు.

- నిధులు మంజూరైనా ప్రారంభానికి నోచుకోని అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు సూచించారు. కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ మాట్లాడుతూ... ముషీరాబాద్‌లో డ్రైనేజీ, మంచి నీటి పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి అయిన ప్రాంతాలలో వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. షేర్ అలీవీధి, బాపూజీ నగర్, పార్సిగుట్ట తదితర ప్రాంతాలలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
- బీఆర్ఎస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ట్రేడ్ సెల్ డివిజన్ అధ్యక్షుడు టెంట్‌హౌజ్ శ్రీనివాస్, నాయకులు నేత భాస్కర్, పూస గోరఖ్‌నాథ్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, నగర కార్యవర్గ సభ్యులు జమాల్‌పురి నందు, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి ఏసీపీగా రమేష్‌కుమార్

చిక్కడపల్లి: చిక్కడపల్లి నూతన ఏసీపీగా రమేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ నుంచి బదిలీపై వచ్చిన రమేష్ కుమార్‌కు ఇప్పటివరకు ఏసీపీగా బాధ్యతలు నిర్వర్తించిన మదుమోహన్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ... చిక్కడపల్లి డివిజన్ ప్రాంతంలో చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల సహకారంతో శాంతిభద్రతలు పరిరక్షించడంతో పాటు ప్రతీ అంశాన్ని కూలంకషంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తదితరులు పాల్గొన్నారు. ఏసీపీ రమేష్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు జి.జయేందర్‌బాబు, ఎ.వెంకట్రావ్, శేషుకుమార్‌లు శాలువ కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.

'గృహజ్యోతి' దరఖాస్తుకు నేడే ఆఖరు

నల్లకుంట: ప్రజల విజ్ఞప్తి మేరకు గృహజ్యోతి పథకంలో లబ్ధిదారుల ఎంపిక కోసం మరో రెండు రోజులు గడువు పొడిగించినట్లు ఎలక్ట్రిసిటీ బర్కత్‌పురా సెక్షన్ ఏఈ శుక్రవారం బాలరాజు తెలిపారు. ఈ గడువు శనివారం(నేడు)తో ముగుస్తుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకంలో లబ్ధి కోసం అవసరమైన జిరాక్స్ ప్రతులను విద్యుత్ శాఖ అధికారులకు అందజేయాలని సూచించారు. లబ్ధిదారుల వివరాలు సేకరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్ స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బస్తీలోని 200 యూనిట్ల విద్యుత్ వినియోగదారులు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఎలక్ట్రిసిటీ బిల్లు కాపీలు, ఫోన్ నంబర్‌తో పాటు ఇటీవల ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజా పాలన రశీదు జిరాక్స్ ప్రతులను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ గణేశ్, రత్నానగర్ బస్తీ అధ్యక్షుడు పి.ఈశ్వర్ పాల్గొన్నారు.

కులగణన తీర్మాన బిల్లు చారిత్రక నిర్ణయం

నల్లకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో కుల జనగణన బిల్లు ప్రవేశపెట్టడం చారిత్రక నిర్ణయమని తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ మురళీ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయాలతో పాటు ఆర్థిక, సామాజిక న్యాయం చేకూరుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఈ బిల్లుపై తీర్మానం ప్రవేశపెట్టడం సాహసోపేత నిర్ణయమని చెప్పారు. కులగణనతో రాష్ట్ర జనాభాలో 85 శాతం ఉన్న బడుగు, బలహీన వర్గీలకు న్యాయం జరుగుతుందన్నారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కుటుంబ సర్వే వివరాలను బహిర్గతం చేయకుండా బడుగు, బలహీన వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు.

గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టాన్ని రూపొందించాలి

కాచిగూడ: గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టాన్ని రూపొందించాలని గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు వల్లాల మంజుల డిమాండ్ చేశారు. గృహకార్మికులు శుక్రవారం కాచిగూడ నుంచి ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వరకు ర్యాలీగా వెళ్ళారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఐఎల్ఓ కన్వెన్షన్ 189 ని ఆమోదించాలని, త్రైపాక్షిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్ ప్రసూతి, గృహాలు, పెన్షన్ లాంటి సామాజిక భద్రత పథకాలు వర్తింప చేయాలని అన్నారు. పనిచేసే ఇంటిని కార్యాలయంగా గుర్తించాలని, లేబర్ కోడ్‌లు ఉపసంహరించాలని, లేబర్ చట్టాలు పునరుద్ధరించాలని అన్నారు. సామాజిక భద్రతా మరియు కార్మిక సంక్షేమం కోసం 3 శాతం సెస్ వసూలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ సిస్టర్ లూర్దు, రమ్య, శోభలతో పాటు గృహ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'కార్పొరేట్' కొమ్ముకాస్తున్న మోదీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



కవాడిగూడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీలకు మరిన్ని ఆర్థిక ప్రయోజనాలు కలిగించేందుకు కృషిచేయడం హేయమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్‌మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌వద్ద బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే కార్మికులపై కక్షసాధింపు చర్యలు, కార్మికుల చట్టాలను 44లో 29 కార్మిక చట్టాలను సమూలంగా మార్చేసి నాలుగు కోడ్‌లుగా విభజించి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారస్తులకు మేలు చేసే చర్యలు తీసుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. దేశంలో అత్యధిక ప్రజలు వ్యవసాయంపై ఆధారపడిన చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించకపోవడం, కరువు, కాటకాలు, తెగుళ్ల వల్ల పంట నష్టపోతే పంటకు నష్టపరిహారం చెల్లించాల్సింది పోయి ప్రభుత్వం మొండి తనంతో రైతులను నిర్లక్ష్యం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ పరిసర ప్రాంతాలలో సమస్యలపై రైతులు లక్షలాది మంది నిరసన చేపట్టిన కేంద్ర ప్రభుత్వం వారిని లెక్కచేయకుండా వ్యవహరించడం సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌టీయూ నాయకుడు జి.రాంబాబు యాదవ్, ఐఎన్‌టీయూసీ నేత ఆర్.బి.చంద్రశేఖర్, సీఐటీయూ నాయకుడు ఎం.వెంకటేష్, ఐఎఫ్‌టీయూ నాయకుడు ఎస్.ఎల్ పద్మ, ఏఐటీయూసీ నేత ఎం.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉంటే ఉపాధి అవకాశాలు పుష్కలం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతిభ గల విద్యార్థులకు ఎక్కడనైనా చక్కటి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రిషికాంత్, డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంబేడ్కర్ విద్యా సంస్థల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులు దృష్టిలో పెట్టుకొని మల్టీనేషనల్ కంపెనీలను సంప్రదించి వారి ప్రతిభ ఆధారంగా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో టెక్ మహేంద్ర, క్యూ కనెక్ట్, ఎస్‌బీఐ, అక్సిస్ బ్యాంక్, లెన్స్ కార్టు, జెస్ట్ డయల్ కంపెనీలు పాల్గొని 185 మంది విద్యార్థులను ఇంటర్వ్యూ చేసి వారిలో ప్రతిభ గల వారిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు వెంటనే నియామకపత్రాలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ అధికారి చాగంటి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ ముదిగొండ భవానీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆ కులాలను బీసీ జాబితాలో చేర్చొద్దు'

కాచిగూడ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీ జాబితా నుంచి తొలగించిన 27 కులాలను తిరిగి జాబితాలో చేర్చవద్దని తెలంగాణ 'బీసీ–ఏ' కులాల హక్కుల పరిరక్షణ సమితి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ భాగయ్య, ప్రధానకార్యదర్శి ముత్యాల నరసింహులు, ఉపాధ్యక్షుడు గడప శ్రీహరి, కోశాధికారి అంబటి మల్లయ్య సుధాకర్ గంగపుత్ర బృందం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జాబితా నుంచి తొలగించిన 27 కులాలను తిరిగి తెలంగాణ బీసీ జాబితాలో కలపాలని కొంతమంది బీసీ రాజకీయ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగిన మిగతా కులాలను బీసీ–ఏ జాబితాలో చేర్చడమంటే భిక్షాటన కులాలను కనుమరుగు చేయడమే అని పేర్కొన్నారు.

కార్మికులకు పెంచిన వేతనాలను చెల్లించాలి: టీజీహెచ్ఈయూ



ఫీవర్ ఆస్పత్రి ఆవరణలో నినాదాలు చేస్తున్న ఓట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు

నల్లకుంట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు గతంలో పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ సంస్థ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్(టీజీఎంఈయూ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. టీజీహెచ్ఈయూ నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి శాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు శుక్రవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఆవరణలో రెండు గంటల పాటు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ఫీవర్ శాఖ అధ్యక్షురాలు నవరత్న కళ మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్మికులకు ప్రతి నెల రూ. 15,600లకు గానూ రూ. 13,065 చెల్లించాల్సి ఉండగా రూ. 11 వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానం కారణంగా ఉద్యోగులు శ్రమదోపిడీకీ గురవుతున్నారని, వెంటనే కాంట్రాక్ట్, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమకు పండగ సెలవులు ఇవ్వాలని కోరారు. యూనియన్ నాయకులు ఖమారుద్దీన్, సయ్యద్ అలీమ్, జి. సర్వేశ్వర్ రావు, లక్ష్మీబాయి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర పథకాలు అందేలా కృషి



బాపూనగర్‌లో జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న గౌతంరావు తదితరులు

అంబర్‌పేట: దేశంలోని పేదలందరి సంక్షేమం, అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందేలా తమ పార్టీ కృషి చేస్తుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో ఆధార్ సవరణలు, ఆయుష్మాన్ భారత్ నమోదు, టీబీ వ్యాధి నివారణకు నిర్ధారణ పరీక్షలు, బ్యాంక్ సేవలు వంటి సేవలు అర్హులకు అందించడమే లక్ష్యంగా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశ అభివృద్ధి కోసం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని, దీనికి ప్రజల మద్దుతు ఇవ్వాలని కోరారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు పట్టం కట్టాలని ఆయన అన్నారు. బీజేపీ నాయకులు నాగభూషణంచారి, కృష్ణ ముదిరాజ్, యాదగిరి, భిక్షపతి, నవీన్‌రెడ్డి, మైలారం రాజు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలి

కవాడిగూడ: గ్రామీణ బ్యాంకులలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల సర్వీసును తక్షణమే క్రమబద్ధీకరించాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.రవికాంత్, ఎస్ వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలో 15 వేల మంది తాత్కాలిక ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. శుక్రవారం గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వివిధ గ్రామీణ బ్యాంకులలో 30 వేలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటిని కూడా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ బ్యాంకులను కలిసి జాతీయ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయాలన్నారు. పార్లమెంటు కమిటీ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు. సంఘం ఆలిండియా ఉపాధ్యక్షుడు భిక్షమయ్య, నేతలు నర్సింహారాజు, అప్పలనాయుడు, క్రాంతికుమార్, రాజ్‌కుమార్, సత్యనారాయణ, సతీష్ వెంకట్‌రావు పాల్గొన్నారు.

జీవితాన్ని వ్యాఖ్యానించేది కవిత్వం మాత్రమే...

కాళోజీ అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్



యువతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న అమ్మంగి వేణుగోపాల్, జూలూరి గౌరీ శంకర్ తదితరులు

కవాడిగూడ: జీవితం లేకుండా కవిత్వం లేదని జీవితాన్ని వ్యాఖ్యానించేది కవిత్వం మాత్రమే అని కాళోజీ అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్ అన్నారు. చుట్టూ ఉన్న జీవితాన్ని, సమాజంలో జరుగుతున్న రణగొణ ధ్వనులను నేటి తరం కవులు అధిగమించాలన్నారు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల ద్వారా యువతరం, నవతరం కవులు గళమెత్తాలని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో 'యువతరం కవుల అంతరంగ ఆవిష్కరణ' అనే అంశంపై నేటి తరం యువకులు మాట్లాడారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రసేన్ మాట్లాడుతూ... చూసింది రాయాలని, శృజనాత్మకంగా రాయడంతోపాటు, ఎవరినో అనుసరించడం కాకుండా రచయిత సొంత శైలిలో రాయాలని ఆయన తెలిపారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ... ఈ తరం, సమాజం ముందు అనేక సవాళ్లు ఉన్నాయని ఆ సవాళ్లను ఎదుర్కొంటూ సాహిత్య సృష్టి జరగాలని ఆయన తెలిపారు.కవి యాకూబ్, బుక్‌ఫెయిర్ ఉపాధ్యక్షుడు పి.నారాయణరెడ్డి, యువతరం కవులు దొంతం చరణ్, పేర్ల రాము, కె. కళ్యాణి, లికిత్‌కుమార్, శ్రీనిధి, విప్లవశ్రీ, రవీంద్ర, జి. అనూష, టి. సతీష్ కుమార్, సాత్విక, మహేష్, ఆకాష్ పాల్గొన్నారు.

స్వర్ణభారతి (భారతీయ ఆర్థిక చరిత్ర) పుస్తకావిష్కరణ...

హైదరాబాద్ బుక్‌ఫెయిర్ జరుగుతున్న గద్దర్ ప్రాంగణంలోని రవ్వ శ్రీహరి వేదికపై కందవల్లి సత్యదేవ్ ప్రసాద్ రచించిన స్వర్ణభారతి (భారతీయ ఆర్థిక చరిత్ర) పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ... కందవల్లి రచించిన స్వర్ణభారతి లాంటి ఆర్థిక శాస్త్రం పుస్తకం ఒక సాహసం అని పేర్కొన్నారు. పుస్తక రచయిత సత్యదేవ్ ప్రసాద్, ఎస్.ప్రకాషణ్, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

అంబర్‌పేట: అభివృద్ధి పనులను ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కాలనీ, ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఎదురు లేన్‌లో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పైపులైన్ పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, చందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేడుకగా భద్రావతి కల్యాణం

కాచిగూడ: భద్రావతి భావనారుషిల కల్యాణం శుక్రవారం ఘనంగా జరిగింది. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలతో పాటు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కందగట్ల శోభ, బిట్ల ఉప్పలయ్య, మణెమ్మ, సిరిమల్లె ప్రకాశ్‌రావు, జయశ్రీ, అయిటిపాముల వెంకటేశ్వర్లు, కళావతి, కాచర్ల రాజ్‌కుమార్, చేతన, పోరండ్ల రాజీవ్‌కుమార్, శ్రావ్య, గాడిపల్లి రూపేశ్‌కుమార్, శ్రీలేఖ, చిక్క రామారావు, గోదాదేవి, కారంపూరి రేఖా ప్రభాకర్, వనం దుశ్యంతుల, అవ్వారు భాస్కర్, గుంటక రూప, కత్తుల సుదర్శన్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్: ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మోహినుద్దీన్ సూచించారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని ప్రేయర్ పవర్ చర్చిలో కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్, ప్రేయర్ పవర్ చర్చి వ్యవస్థాపకులు శ్యామ్ అబ్రహంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహినుద్దీన్ మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో కంటి, దంత పరీక్షలు, గుండె జబ్బులు, గైనకాలజిస్టు, గ్యాస్ ట్రాలజీ, షుగర్, బీపీ, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్.మోజెస్, డాక్టర్లు సయ్యద్ అబ్దుల్ ఆలీం, డాక్టగర్ రవిచంద్ర, డాక్టర్ సుజిత్‌కుమార్, డాక్టర్ స్వాతి, డాక్టర్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్ టౌన్ స్కూల్‌లో..

కాచిగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వాకర్‌టౌన్ స్కూల్ ప్రిన్సిపాల్ విమల రాజ్ పురోహిత్ అన్నారు. మెడికోవర్ హాస్పిటల్ బేగంపేట బ్రాంచి ఆధ్వర్యంలో వాకర్ టౌన్ స్కూల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది, హాస్పటల్ డాక్టర్లు పాల్గొని విద్యార్థులకు, టీచర్లకు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, ఐ చెకప్, డెంటల్ చెకప్ వైద్య సేవలు అందించారు. మెడికోవర్ హాస్పిటల్ బేగంపేట బ్రాంచి హెడ్ రాజ్‌కుమార్, మేనేజర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై ఎమ్మెల్యే కాలేరుకు మాట్లాడే అర్హత లేదు

మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, టీపీసీసీ కార్యదర్శి శుంభుల శ్రీకాంత్‌గౌడ్



అంబర్‌పేట: ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రొటోకాల్ వంటి మాటలను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అసెంబ్లీ సాక్షిగా మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అంబర్‌పేట నియోజకవర్గం మాజీ కార్పొరేటర్లు ఎద్దేవా చేశారు. కాలేరు వెంకటేశ్ గత ఐదు సంవత్సరాలుగా శాసన సభ్యునిడిగా ఉండి నియోజకవర్గంలో ఇతర ప్రజా ప్రతినిధుల పట్ల ప్రొటోకాల్ పాటించారా అని వారు ప్రశ్నించారు. శుక్రవారం డీడీ కాలనీలోని మాజీ ఎంపీ వీహెచ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, టీపీసీసీ కార్యదర్శి శుంభుల శ్రీకాంత్‌గౌడ్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు శుంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్‌లు మాట్లాడారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అసెంబ్లీలో అంబర్‌పేటలో ప్రొటోకాల్ పాటించడం లేదని కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన రోహిణ్‌రెడ్డిపై అక్కసు వెళ్లగక్కడం సబబు కాదని వారు హితవు పలికారు. అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధి కోసం రోహిణ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రూ. 20 కోట్ల నిధులు మంజూరు చేయించారని, దీనిని ఆహ్వానించాల్సిన ఎమ్మెల్యే ఎలా మంజూరు చేయిస్తారని ప్రశ్నించడం దారుణమన్నారు. నియోజకవర్గ ప్రజలకు మౌలిక వసతుతులు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఇకపై అన్ని విధాల చొరవ తీసుకుంటుందని వారు స్పష్టం చేశారు. ఆయన అవినీతిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ఉన్న జి.కిషన్ రెడ్డిని ఏనాడైనా అభివృద్ధి కార్యక్రమానికి ఆహ్వానించావా అని వారు ఎమ్మెల్యే కాలేరు సూటిగా ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించని వారు ప్రొటోకాల్‌పై మాట్లాడే అర్హత లేదన్నారు. తమ నేత రోహిణ్‌రెడ్డిపై ఇకపై చవకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదని వారు స్పష్టం చేశారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి



క్రాస్‌రోడ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

చిక్కడపల్లి: విద్యారంగంలో మతోన్మాద ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలుచేయాలని చూస్తున్నారని, విద్యారంగాన్ని కార్పొరేట్, ప్రైవేటు శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేయడానికి దేశంలో నూతన విద్యావిధానం తీసుకుని వస్తున్నారని పలు విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. దేశంలో విదేశీ యూనివర్శిటీలను రద్దు చేయాలని, యూజీసీకి గ్రాంట్ పెంచాలని డిమాండ్ చేస్తూ రైతులు, కార్మికులు ఇచ్చిన గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా శుక్రవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్, ఏఐడీఎస్‌ఓ, ఏఐఎస్ఏఫ్, పీడీఎస్(వి) తదితర వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నారాయణగూడ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు విద్యార్థి ప్రదర్శన, అనంతరం క్రాస్ రోడ్డులో నిరసన సభ జరిగింది. సంఘాల నేతలు టి. నాగరాజు, ఆర్ఎల్ మూర్తి, పుట్టా లక్ష్మణ్, మహేష్, రామకృష్ణ, మల్లేష్ హకీమ్, నవీద్, ఎ.విజయ్ మాట్లాడుతూ... దేశంలో విద్యారంగానికి తక్కువ నిధులు ఇచ్చి నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వం ప్రభుత్వ యూనివర్శిటీలను, విద్యాసంస్థలను నష్టం చేసే చర్యలు చేస్తుందని ధ్వజమెత్తారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలి

ముషీరాబాద్: సామాజిక దృక్పదంతో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని ఆపదలో ఉన్నవారిని ఆదుకోవా లని బీఆర్ఎస్ గ్రేటర్ యువజన కమిటీ కార్యదర్శి కోక రవి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బాలికలకు నోటు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రవి మాట్లా డుతూ... ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నేతలు ముందుకు రావాలి అన్నారు. బాలికలు బాగా చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కోక రవి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందిస్తూ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆయనను ఘనంగా సన్మానించారు. రాజేష్, అంజి, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం

అంబర్‌పేట: బీజేపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఉంటుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేటకు చెందిన బాలకృష్ణగౌడ్ బీజేపీ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. బాలకృష్ణగౌడ్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తిరిగి మోదీ ప్రభుత్వాన్ని గెలిపించేందుకు తోడ్పాటును అందించాలని కోరారు. బీజేపీ నాయకులు చుక్క జగన్, కోడురు సురేష్, ఎం.రోహిత్‌గౌడ్, విజయ్ శేఖర్, మధుసూదన్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా రోజ్‌బడ్స్ స్కూల్ వార్షికోత్సవం



రోజ్ బడ్స్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని హరిహర కళాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, రూపారెడ్డి, కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383